ప్రజాశక్తి
శనివారం 16 డిసెంబర్ 2023
5
కర్నూలు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అశోక్ ధావలే, విజ్జు కృష్ణన్ తదితరులు

కర్షకుల నినాదాలతో హోరెత్తిన కర్నూలు

ఎఐకెఎస్ కౌన్సిల్ ప్రారంభం

- కర్నూలు నగరంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ - రెడ్‌షర్టు వాలంటీర్లు, డప్పుకళాకారుల ప్రత్యేక ఆకర్షణ

బహిరంగ సభకు భారీగా హాజరైన రైతు సంఘాల నేతలు, రైతులు, ప్రజలు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్/క్రైమ్

దేశ,రాష్ట్రాల, జిల్లాల రైతుల సమస్యలను చర్చించి పాలకులకు దిశనిర్దేశం చేయడానికి, భవిష్యత్తులో రైతుల పక్షాలన పోరాడటానికి కావల్సిన ప్రాతిపదికను రూపొందించడానికి మూడు రోజులపాటు నిర్వహించే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు కర్నూలు వేదిక అయింది.

తొలిరోజు శుక్రవారం కర్నూలు నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కర్షక లోకం కదం తొక్కింది. కర్నూలు నగరంలో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సత్య ఇన్ రెసిడెన్సీలో శంకరయ్య నగర్ వేదికగా దేశంలోని ఆయా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే పతాక ఆవిష్కరణ చేశారు. నాయకులు, కౌన్సిల్ కమిటీ సభ్యులు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే అధ్యక్ష ఉపన్యాసం చేశారు. సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీరామ్ థియేటర్, మౌర్య ఇన్, రాజ్ విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ మీదుగా పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ క్రిష్ణన్ ర్యాలీ అగ్ర భాగాన నిలిచి ముందుకు నడిపించారు. ర్యాలీలో రైతులు ఎర్ర కండువాలు, ఏఐకేఎస్ జెండాలతో ర్యాలీ ఆద్యంతం ఎరుపెక్కింది. అత్యంత క్రమశిక్షణతో రైతు సంఘం నినాదాలు చేస్తూ అత్యంత ఉత్సాహంగా ముందుకు కదిలారు. ర్యాలీకి ముందు భాగాన స్వాగతం పలుకుతూ ఎపి డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన డప్పుల దరువు నృత్యంతో నగరం దద్దరిల్లింది. ర్యాలీలో ముందు భాగాన ఎర్ర దుస్తులు ధరించిన వాలంటీర్ల కవాతుతో ఘన స్వాగతం పలికారు. వెంకటేష్ థియేటర్ సమీపంలో యుటిఎఫ్ నాయకులు సంఘీభావాన్ని తెలియజేస్తూ పూల వర్షంతో ర్యాలీకి స్వాగతం పలికారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా రైతాంగంలో భారీ ఎత్తున చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించేలా రైతుల ప్రదర్శన కొనసాగింది. ర్యాలీ అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

కార్యక్రమంలో ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి కె.కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు టి.సాగర్, రైతు సంఘం సీనియర్ నాయకులు కేశవ రావు, సూర్యనారాయణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అధ్యక్షులు కె.వెంకటేశులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిఐటియు సీనియర్ నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ పాల్గొన్నారు.

కర్నూలు బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య, వేదికపై ఎఐకెఎస్ నాయకులు అశోక్‌ధావలే, విజుకృష్ణన్

ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టవు

- ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా

ప్రజల సమస్యలు కేంద్ర ప్రభుత్వానికి పట్టవని ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా అన్నారు. రైతుల ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. అబద్ధాలు చెప్పడంలో, ప్రజలను మోసం చేయడంలో మోడీ నంబర్ వన్‌గా ఉన్నారన్నారు. నల్ల ధనాన్ని లేకుండా చేస్తామన్న మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. ఎపి ప్రజలు కూడా పోరాటాలతో ముందుకెళ్లాలని, మతోన్మాద బిజెపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు అని, పాలకుల నిర్లక్ష్యంతోనే ఆ పరిస్థితి దాపురించిందని అన్నారు. ఏ ప్రభుత్వమూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టలేదన్నారు. ఈ ప్రభుత్వాలకు ప్రజల కష్టాల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే కర్నూలు జిల్లా ఆకలి, కరువు, వలసతో అల్లాడి పోతోందన్నారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి సాధించాలంటే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీసం 350 మండలాలను కరువు మండలాలుగా, కర్నూలు జిల్లాకు కరువు జిల్లాగా ప్రకటించాలని అన్నారు. కర్నూలును కరువు, వలసల నుండి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజూ కష్ణన్ ప్రసంగించారు.

మాట్లాడుతున్న ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా

రైతులు, కార్మికులు పోరాటాలకు ముందుకు రావాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్

దేశాన్ని, దేశంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాలని, రైతులు, కార్మికులు పోరాటాలకు ముందుకు రావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ పేర్కొన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మోడీని ఓడించిన చరిత్ర రైతు సంఘాలకు ఉందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని, కార్మికులకు కూడా రైతాంగ పోరాటమే స్ఫూర్తి అని తెలిపారు. ప్రతి పంటకూ గిట్టుబాటు ధర ఇస్తేనే రైతుల జీవితాలు బాగుపడతాయన్నారు. ప్రభుత్వాలు రైతులను, కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే కాలంలో ఉద్యమాలు చేసి హక్కులను కాపాడుకోవాలని, వ్యవస్థను మార్చాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు ఉమ్మడిగా సమరశీల పోరాటాలు సాగించాలన్నారు. రైతాంగంతో పాటు కార్మికులు కూడా కలిసి పోరాడతారన్నారు. లక్షలాది మంది వలస వెళ్తుంటే జగన్‌కు చీమ కుట్టినట్టైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రజల కష్టాలు ఎమ్మెల్యేలకు, ఎంపీలకు పట్టడం లేదన్నారు. మూడు నెలల తరువాత జగన్‌కు ప్రజలు రాజకీయంగా సమాధి కడతారన్నారు. విధ్వంసం, మత విద్వేషం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బిజెపి రాజనీతి అన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్

అమరవీరులకు ఎఐకెఎస్ కౌన్సిల్ సంతాపం

అమర వీరులకు ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశం సంతాపం తెలిపింది. సంతాప తీర్మానాన్ని కేరళ కిసాన్ సభ నాయకులు ఎం.విజయ కుమార్ ప్రవేశపెట్టారు. ఎఐకెఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్.శంకరయ్య, ఎఐకెఎస్ మాజీ ఉపాధ్యక్షులు మదన్ ఘోష్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సునీత్ చోప్రా, సిఐటియు మాజీ ఉపాధ్యక్షులు బసుదేవ్ ఆచార్య, అఖిల భారత రైల్వే ఫెడరేషన్ నాయకులు కనై బెనర్జీ, కేరళ మాజీ ఎమ్మెల్యే ఆనందన్, త్రిపుర ఎఐకెఎస్ నాయకులు మణిక్ దాస్ గుప్తా, పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి నారాయణ బిస్వాస్, ఐద్వా మాజీ ఉపాధ్యక్షులు సరోజినీ బాలానందన్, హర్యానా ఎఐకెఎస్ నాయకులు ప్రదీప్ సింగ్, ఎఐకెఎస్ నాయకులు మృదుల్ దే, సౌతాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ నాయకులు క్రిస్ మత్లకో, సహరన్‌పూర్ రైతు సంఘం నాయకులు గులాబ్ సింగ్‌కు కౌన్సిల్ సమావేశం సంతాపం తెలిపింది. యుపి సిఐటియు నాయకులు కెఎన్.బట్, త్రిపుర ఎఐకెఎస్ నాయకులు శామ్యూల్ హక్, ఎఐకెఎస్ నాయకులు వివన్ సుందరం, పులిన్‌బర్ధన్, యుపి ఎఐకెఎస్ నాయకులు అదిక్ అహ్మద్, కేరళ సిపిఐ కార్యదర్శి ఖానం రాజేంద్రన్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్, జెఎన్‌యు ప్రొఫెసర్ అనిల్‌భట్టి, జనమోర్చ చీఫ్ ఎడిటర్ శీతల్‌సింగ్, పశ్చిమ బెంగాల్ ఎఐకెఎస్ మాజీ ఉపాధ్యక్షులు హరేకృష్ణ సమంద, కేరళ కర్షక సంఘం ఉపాధ్యక్షులు పికె.సుధాకరణ్, మాజీ ఎమ్మెల్యే కె.కుంజరామన్, తమిళనాడు కిసాన్‌సభ నాయకులు శక్తివేల్, శంకర్, జార్ఖండ్ సిపిఎం నాయకులు సుబాష్ ముండా, బీహార్ ఎఐకెఎస్ నాయకులు రాజేష్ హన్సల్‌కు సమావేశం సంతాపం తెలిపింది. ఉక్రెయిన్, పాలస్తీనాలో యుద్ధంలో, మృతి చెందిన వారికి, ప్రకృతి వైపరీత్యాల్లో మరణించిన వారికి, వివిధ ఉద్యమాలు, పోరాటాల్లో అమరులైన వారికి సమావేశం సంతాపం తెలిపింది. సంతాప సూచికంగా కౌన్సిల్ సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది.

సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఎం.విజయ కుమార్, వేదికపై ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తదితరులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా కర్నూలు పాతబస్తీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించి, ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రాల తల్లి బందీ అయ్యిందో మా పల్లెల్లోనా, రాయలేలిన నాటి రతనాలసీమలో రగులుతున్నది కరువు రా, ఊరు విడవమన్నది కరువు ఉరితాడై ఉన్నది కరువు, నేలమ్మ నేలమ్మ నీకు వేలవేల వందనాలమ్మ, భారతదేశం బాకిన పడ్డది, ఎర్రజెండ ఎర్రజెండ ఎన్నియాలో, అని పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. చేసింది విన్నది చూసి చప్పట్లు చర్చేల నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈ.రాజు, ఎంపీ బసవరాజు, లోకేష్, బతుకన్న, లక్ష్మీనారాయణ, నోమేశ్వరి, ఏలియా, బజారి, లక్ష్మన్న, ముని, లక్ష్మి, సరిత, అనిత, కిట్టు, సుబ్బు, నాగ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేదికపై పిఎన్ఎం కళాకారుల నృత్య ప్రదర్శన

జర్నలిస్టులకు యాక్సిడెంటల్ బీమా పాలసీ పత్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, డిడి జయమ్మ

జర్నలిస్టులకు బీమా పాలసీ పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజంలో ప్రతి ఒక్కరూ బీమా పాలసీలపై అవగాహన పెంపొందించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ కోరారు. నగరంలోని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జర్నలిస్టులకు సంబంధించి ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆక్సిడెంట్ బీమా పాలసీలను, క్యూ ఆర్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ ,ఐపిపిబి మేనేజర్ మహమ్మద్ అజీజ్ బాష, ఫోటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మీసాల రామస్వామి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ విదేశాలతో పోలిస్తే మన దేశంలో బీమాలపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ డెత్ ఇన్సూరెన్స్ వంటి బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సమాజంలో ఎంతో కీలకమైన బాధ్యతలు పోషిస్తున్న జర్నలిస్టులకు తన వంతుగా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల బీమా తీసుకున్న జర్నలిస్టులు ప్రమాదానికి గురైతే రూ.లక్ష వరకు, దుర దృష్టవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల వరకు బీమా పరిహారం అందుతుందని చెప్పారు. అందరూ ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవించాలని కోరుకుంటామని , అయినా అనుకోని పరిస్థితులు ఏర్పడితే వారి కుటుంబానికి ఇలాంటి పథకాలు తోడ్ప డుతా యన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బీమా పథకాలను తీసుకొని ధీ మాగా జీవించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ కోరారు.

వరికోత యంత్రం ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోనీ మారందొడ్డిలో వరికోత యంత్రం ప్రమాదంలో శాలింబి అనే మహిళ ప్రమాదవషత్తు మృత్యువాత పడింది. వివరాలోకి వెళితే షాలింబీ కుటుంబీకులతో గురువారం వారి వరి పొలంలో యంత్రంలోకి వరి కుప్పలను వేస్తున్నది. యంత్రం లోకి షాలింబీ తల వెంట్రుకలు వెళ్లడంతో ఒక్కసారిగా తలకు బలమైన గాయమైంది. కర్నూలు ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఆమెకు భర్త సిద్దయ్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

పంటకోత ప్రయోగంతో దిగుబడి అంచనా : మండలంలో వరి కోత పంట ప్రయోగంతో దిగుబడి అంచనా వేయొచ్చని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గుండ్రేవులలో వరలక్ష్మి పొలంలో వరి కోత ప్రయోగం చేసి ఇక్కడే ధాన్యం తూకం వేసి మంచి దిగుబడి వచ్చిందని తెలిపారు. ఘనంకా అధికారి సాంబశివుడు, ఇన్సూరెన్స్ ఏజెంట్ ముస్తక్ సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు అందరికీ ఆదర్శం : జెసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పొట్టి శ్రీరాములు ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య పేర్కొన్నారు. శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మన తెలుగు ప్రజల ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించు కోవాలన్నారు. నేటి యువత పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడిచి రాష్ట్రానికి దేశానికి తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కె. మధుసూదన్ రావు, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి వెంకట లక్ష్మమ్మ కలెక్టరేట్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న జెసి మౌర్య, డిఆర్ఒ మధుసూదన్‌రావు

కాంగ్రెస్ కార్యాలయంలో : ఆంధ్ర రాష్ట్ర పితామహుడు పొట్టి శ్రీరాములు ,ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. వారి చిత్రపటాలకు పిసిసి అధికార ప్రతినిధి కరుణాకర్ బాబు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు కార్పోరేషన్‌లో : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలు కోల్పోయిన మహనీయులు, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు అని కమిషనర్ ఎ. భార్గవ్ తేజ అన్నారు. తన ప్రాణత్యాగంతో ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడేలా చేసి, అమరజీవిగా నిలిచారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన కమిషనర్ ఎ.భార్గవ్ తేజ, ఇతర అధికారులు

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

నాలుగోరోజు కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి- కర్నూలుఅగ్రికల్చర్

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించా లని కోరుతూ 4వ రోజు అంగన్వాడి ఉద్యోగులు ధర్నా చౌక్‌నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్, డిఆర్ఒ అందుబాటులో లే నందున డిఆర్‌డిఎ పిడి వెంకటలక్ష్మికి వినతిపత్రం సమర్పిం చారు. ధర్నాచౌక్‌లో శుక్రవారం నాలుగోరోజు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దే శాయ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, ఎస్‌యుసిఐ జిల్లా నాయకులు నాగన్న, హరీష్, తేజోవతి అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగనవాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించక పోగా అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టాలని నిర్ణయించడం చాలా దుర్మార్గమైన చర్యఅని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని అన్నారు. గతంలో జగన్ ఇచ్చిన హామీనే వారు అడుగు తున్నారని. హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి ఉద్యోగులకు గ్రాడ్యుటీ చెల్లించాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని, ఈ రకమైన పద్ధతే కనక పాటిస్తే రాబోవు కాలంలో ప్రభుత్వం పడిపోక తప్పదని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు జరిపి వారికి సమస్యలు పరిష్కరించాలని, లేదంటే అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడ తామని అన్నారు. సమ్మె చేస్తున్న అంగ న్వాడీల పట్ల బొబ్బిలి ఎమ్మెల్యే వెంకట అప్పల నాయుడు అంగన్వాడీలు బలిసి సమ్మె చేస్తున్నారని వ్యాఖ్యా నించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ దగ్గర ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి ఎంతో సేవ చేస్తున్న అంగన్వాడీల పట్ల ఆ రకంగా వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. అంగన్వాడీలకు ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. లేనియెడల ఎమ్మెల్యే వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతామని అన్నారు. కర్నూలు జిల్లాలో 250 అంగన్‌వాడి సెంటర్లకు తాళాలు పగలగొట్టడం విచారకరమన్నారు. ఈ విధానం మానుకోవాలని కోరారు. యూనియన్ నాయకులు బాలదుర్గమ్మ, చౌడేశ్వరి, ఎఐటియుసి నాయకులు రామాంజనేయులు, సిఐటియు కార్యదర్శి నాగేశ్వరరావు, మల్లన్న,తదితరులు మాట్లాడారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు కామేశ్వరి, బాలదుర్గమ్మ, నాగమణి, మహేశ్వరి, చౌడేశ్వరి, సునంద, రాధిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న డి.గౌస్ దేశాయి



ఎమ్మెల్సీ షేక్‌సాబ్జికి నివాళ్లు అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సాబ్జి మృతి ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి అకాల మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. యుటిఎఫ్‌లో ఉండి అనేక ఉద్యమాలను నిర్వహించారన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీగా ఎన్నికై శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలతో పాటు అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తరన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్ ఆర్థిక కార్యదర్శి యెహోషువ, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు జిల్లా కార్యదర్శిలు ఇబ్రహీం తిమ్మన్న, జిల్లా నాయకులు.. బాలాజీ. ప్రకాష్ రావ్, హనుమంతు, వెంకటేష్, మోహన్, కాంతా రావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

టిడిపితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం : గౌరుచరిత

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ 41వ వార్డ్ లెప్రసీ కాలని చర్చి ఏరియాలో ఇంటింటి ప్రచారంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మెనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇంచార్జి గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. నంద్యాల పార్లమెంటు మహిళ అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, 41వ వార్డ్ ఇంచార్జి నాగేశ్వర రావు, వార్డ్ క్లస్టర్ ఇంచార్జి జనార్ధన్ ఆచారి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

బడుగు, బలహీన వర్గాలకు అత్యవసరమైన విద్య, వైద్యానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బసాపురం గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బసాపురం గ్రామంలోని జగనన్న కాలనీలో పేదలకు 470 పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. సచివాలయం నిధుల రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మండల పరిషత్ పాఠశాలకు రూ.48 లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మాణ దశలో ఉన్నాయని, రైతు భరోసా కేంద్రం రూ.21 లక్షలతో నిర్మాణ దశలో ఉందని తెలిపారు. గ్రామంలో జలజీవన్ యోజన పథకం ద్వారా తాగునీటి పైపులైన్ వేయాలని ఆదేశించారు. కొత్త విద్యుత్ స్తంభాలు 20 మంజూరు చేయించి, కొత్త లైట్లు వేయాలని అధికారులను ఆదేశించారు. సర్పంచి ఈరమ్మ, వీరేష్, ఎంపిటిసి శశిధర్ రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, మండల అధ్యక్షులు గురునాథ్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మనోజ్ రెడ్డి, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు ఫోర్న్ వీడియోలు చూడడం లేదా..?

- రామోజీరావు, చంద్రబాబు, పవన్ వారసులే బాగుండాలా..?

- ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సమాజంలో ఫోర్న్ వీడియోలు (నీలి చిత్రాలు) ఎవరు చూడటం లేదా అని, ఎమ్మెల్యేలు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు, బడా బాబులు ఫోర్న్ వీడియోలు చూస్తున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం చదువుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ట్యాబ్‌లు, ల్యాప్ టాప్, కంప్యూటర్స్ ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఫోర్న్ వీడియోలు చూస్తున్నారని, వారు చెడు దారి పడుతున్నారని రామోజీ రావు తన పత్రికలో రాయడం దారుణమన్నారు. హైదరాబాద్, పెద్ద పెద్ద నగరాల్లో అనేక మంది ఫోర్న్ వీడియోలు చూస్తున్నారని తెలిపారు. సమాజంలో జగన్‌ను చులకన చేసే కుట్ర చేస్తున్నారని చెప్పారు. సమాజంలో ఎవరో కొందరు చేసే చెడు పనులను అందరికీ ఆపాదించడం దుర్మార్గమన్నారు. రామోజీ రావు, పవన్ కళ్యాణ్, చంద్రబాబు వారసులే చదవాలా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలు చదవకూడదా అని ప్రశ్నించారు. పెత్తందారుల ఆలోచనలు చేయడం అనాగరికమని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, వైసిపి నాయకులు బిఆర్.బసిరెడ్డి పాల్గొన్నారు.

మానసిక వికలాంగులతో క్రిస్మస్ వేడుకలు

- మానవత్వం చాటిన ఫాతిమా స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మదర్ థెరిస్సా హౌస్‌లో మానసిక వికలాంగులతో కలిసి శుక్రవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలను ఫాతిమా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు నిర్వహించారు. మదర్ థెరిస్సా హౌస్‌లో ఫాతిమా స్కూల్ ప్రధానోపాధ్యాయులు అజిత, ఉపాధ్యాయురాలు కలిసి, విద్యార్థులతో క్రిస్మస్ సందర్భంగా డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. అలాగే ప్రతి ఒక్క మానసిక వికలాంగునికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఫాతిమా స్కూల్ విద్యార్థులను మదర్ థెరిస్సా హౌస్ యాజమాన్యం స్వాగతం పలికి దీవెనలను తెలియజేశారు. మేరీ మాత మిషన్ చర్చిలో చిప్పగిరి ఫాతిమా స్కూల్ విద్యార్థుల నాట్యం అలరించింది. ఉత్సాహంతో, సంతోషంతో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఫాతిమా స్కూల్ యాజమాన్యం తరఫున బియ్యం, డబ్బులు, వంట వస్తువులను మేరీమాత మదర్ థెరిస్సా హౌస్ యాజమాన్యానికి అందజేశారు. అనంతరం ఫాతిమా స్కూల్ విద్యార్థులందరికీ మదర్ థెరిస్సా సేవకులు దీవెనలు అందించారు. ప్రధానోపాధ్యాయులు అజితకులో మదర్ థెరిస్సా యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'ఓట్ల కోసం కాదు... మార్పు కోసమే పోటీ'

ప్రజాశక్తి - ఆదోని

తెలంగాణలో ఓట్ల కోసం కాదని, రాజకీయ మార్పు కోసమే జనసేన పోటీ చేసిందని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లప్ప తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్‌తో చీకటి ఒప్పందం మేరకే ఎన్నికల్లో వైసిపి పోటీ చేయలేదన్నది అందరికీ తెలిసిన విషయమేనన్నారు. పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో అభ్యర్థులు నిలిపి రాజకీయ చైతన్యం కల్పించారని తెలిపారు. అలాంటి నాయకునిపై వ్యక్తిగత విమర్శలు చేసి ముఖ్యమంత్రి జగన్ అభాసుపాలు అవుతున్నారని విమర్శించారు. ఎన్ని ఎత్తుగడలేసినా ప్రజలు జగన్ నమ్మే స్థితి లేదని, ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. నాయకులు రేణువర్మ, తాహెర్ వలీ, రాజశేఖర్, పులి రాజు, నెల్లిబండ రాజశేఖర్, తరుణ్, ప్రకాష్, రామ్ ఉన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

- సమస్యలు పరిష్కరించమంటే తప్పేంటి

- ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో పని చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నామని, సమస్యలు పరిష్కరించాలని కోరితే తప్పేమిటని అంగన్వాడీలు ప్రభుత్వంపై గళమెత్తారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా కనికరం కూడా చూపకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం సమంజసం కాదంటూ నాయకులు వరలక్ష్మి, జానకి వాపోయారు. శుక్రవారం ఆదోనిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ ఎన్.మల్లప్ప, రమేష్ యాదవ్, నాయకులు రేణువర్మ, తాహెర్, పులి రాజు, రాజశేఖర్, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పింఛను సౌకర్యం చివరి జీతంలో 50 శాతం ఇవ్వాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని కోరారు. సూపర్‌వైజర్ ప్రమోషన్ వయస్సు 50 సంవత్సరాలకు పెంచాలని, సర్వీసులో చనిపోయిన అంగన్వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఈ హామీలన్నీ పరిష్కరిస్తామని ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. తమను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా సమ్మె విరమించబోమని తేల్చిచెప్పారు. సెంటర్లను బలవంతంగా తెరిపించడం తగదని హెచ్చరించారు. విజయ్ కుమార్, మహానంద రెడ్డి, తిప్పన్న, సుదర్శన్, కల్లుబావి రాజు, అజయ్ బాబు, ఎంకన్న, ఒబి.నాగరాజు, వైటి.భీమేష్, షేక్షావలీ, శారద, ఈరమ్మ, ప్రభావతి, శాంతి, ఎఐవైఎఫ్ పట్టణ మండల నాయకులు అజిత్ గౌడ్, రమేష్, అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) నాయకులు పద్మమ్మ, సరోజ, మీనాకుమారి, పర్వీన్ పాల్గొన్నారు.

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీల ధర్నా

ఆలూరులో మద్దతు తెలుపుతున్న కోట్ల సుజాతమ్మ

ఆలూరులో అంగన్వాడీలు సెంటర్లను మూసేసి 4వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బాల రంగమ్మ అధ్యక్షతన భారీ ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి నిరసన చేపట్టారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నాయక్, ఇన్‌ఛార్జీ ఆర్ఐ బసన్నగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, మండల నాయకులు షాకీర్ మాట్లాడారు. అంతకు ముందు సమ్మె శిబిరానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, బిజెపి నాయకులు రవీంద్ర రావు, చిదానంద, అంబన్న పాల్గొని అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ... తమ న్యాయమైన కోరికలు తీర్చలేని ప్రభుత్వం అణచివేతకు గురి చేయడం అవివేకమని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శులు బి.గోవర్ధనమ్మ, ఎస్.నాగలక్ష్మి, కృష్ణవేణి, శిరోమణి, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి వి.తిమ్మరాజు, ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడారు. పట్టణంలో, గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి స్వాధీన పరుచుకోవాలని ప్రభుత్వం ఎత్తుగడలు వేయడం సిగ్గు చేటన్నారు. టిడిపి నాయకులు కె.ఆదెన్న, ఎం.శివకుమార్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పిడబ్ల్యు జిల్లా కార్యదర్శి మణెమ్మ, ముస్లిం వెల్ఫేర్ పార్టీ నాయకులు హకీమ్, జనసేన నాయకులు రవి, నాయకులు అనీఫ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, పట్టణ అధ్యక్షులు కృష్ణవేణి, విశాలాక్షి మద్దతు తెలిపారు. నాగేశ్వరమ్మ, నీరజ, శైలజ, హేమలత, త్రివేణి, బసమ్మ, వెంకటలక్ష్మి, జయమ్మ, ఈరమ్మ, శంషాద్ బేగం పాల్గొన్నారు. **మంత్రాలయం** ప్రాజెక్టు కార్యాలయం ధర్నా చేపట్టారు. తహశీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు పాల్గొన్నారు. **ఆస్పరి**లో అంగన్వాడీలు చేపట్టి నిరవధిక సమ్మె నాలుగో రోజూ సాగింది. టిడిపి మాజీ డైరెక్టర్ కృష్ణ, మండల మాజీ కన్వీనర్ తిమ్మన్న, నాయకులు మల్లి, గోవిందు, రఘు, సోమలింగ, వీరేష్ మద్దతు తెలిపారు. సిఐటియు, సిపిఐ, ఎఐటియుసి మండల కార్యదర్శులు రామాంజినేయులు, విరుపాక్షి, కృష్ణమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు జ్యోతి, సరోజమ్మ, ప్రమీలమ్మ, విశ్వకుమారి, విజయలక్ష్మి, రాధమ్మ పాల్గొన్నారు. **కౌతాళం** ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. నాలుగో రోజు సమ్మె కొనసాగించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, అంగన్వాడీ యూనియన్ మంత్రాలయం ఉపాధ్యక్షులు విజయలక్ష్మి మాట్లాడారు. ఎంపిడిఒ సుబ్బరాజుకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీల సమ్మెకు టిడిపి నాయకులు చెన్న బసప్ప, వెంకటపతి రాజు, రాజానందు, రాజాబాబు మద్దతు పలికారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, గ్రామ సేవకుల సంఘం నాయకులు ప్రహ్లాద, నాగరాజు, మారెప్ప, అనుమేష్, ఐఎఫ్‌టియు నాయకులు నాగేంద్ర, అంగన్వాడీ నాయకులు విజయలక్ష్మి, కాసీంబీ, కామాక్షి, రత్నమ్మ, దీప్తి, చామండి, రాధా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు కృషి

- యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తూనే, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి యుటిఎఫ్ కృషి చేస్తోందని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డి.రాముడు, కె.లచ్చప్ప, ఎస్.ఉమారాజేశ్వరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఎన్.నాగమణి, జె.ఎల్లప్ప తెలిపారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్లను శుక్రవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎం.రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతేడాది మోడల్ పేపర్ల ప్రచురణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పేపర్లను పదో తరగతి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు, సుదీర్ఘ అనుభవం, విషయ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు, పరీక్ష పేపర్లు దిద్దేవారు రూపొందించారని చెప్పారు. గతేడాది పబ్లిక్ పరీక్షల్లో యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లలోని ప్రశ్నలు 80 శాతానికి పైగా వచ్చి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎంతో చక్కగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఈ మోడల్ పేపర్లు ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు, జిల్లా కార్యదర్శులు దేవపాల్, నరసింహులు, కౌలన్న, రాఘవేంద్ర, మల్లారి నాగరాజు, బాబు, కె.లక్ష్మన్న, పెద్దారెడ్డి, పాపయ్య, శివకుమార్, ప్రసాద్, గురుస్వామి, చంద్రపాల్, సంపత్ కుమార్, జయరాజు, మల్లికార్జున, పరమేష్, అంజి, ఆంజనేయులు, పాలాగి, రవికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

పట్టపగలే అంగన్వాడీ కేంద్రాల తాళం పగులగొట్టిన దొంగ ప్రభుత్వం

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్రంలో నియంత పాలన చేస్తున్న వైసిపి ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు పెంచాలని, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరినందుకు అరెస్టులు, కేసులు బనాయిస్తూ నిర్లక్ష్యం చేయడం దారుణమని తెలిపారు. సమ్మెలోకి వెళ్లగా పట్టపగలే ఇళ్లలో దొంగలు పడినట్లు ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ, సచివాలయ, ఐసిడిఎస్ అధికారులతో అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం ఈ దొంగ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. రాష్ట్రంలోని వివిధ రంగాల కార్మిక, కర్షకులు ఆగ్రహానికి గురికాక తప్పదని తెలిపారు. బెదిరింపులకు, కేసులకు, దాడులకు భయపడే ప్రసక్తేలేదని హెచ్చరించారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని తెలిపారు. **ఆస్పరి**లోని 1, 2, 3, 4, 5వ అంగన్వాడీ కేంద్రాలు, చిరుమాన్ దొడ్డి గ్రామంలో సెంటర్ తాళాలను విఆర్ఒ, సచివాలయ సిబ్బంది పగులగొట్టారు. విషయం తెలుసుకున్న అంగన్వాడీలు తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి బైఠాయించారు. అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు జ్యోతి మాట్లాడుతూ... తమకు సమాచారం ఇవ్వకుండా తాళాలు ఎలా పగులగొడతారని ప్రశ్నించారు. తమను అడిగితే తాళాలు తెరుస్తామని, దౌర్జన్యం చేయడంపై మండిపడ్డారు. తహశీల్దార్ కార్యాలయానికి విఆర్ఒలను పిలిపించి మాట్లాడాలని డిమాండ్ చేశారు. దాదాపు నాలుగు గంటల పాటు తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేయడంతో ఉద్యోగులు బయటే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సిఐ వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని మాట్లాడడంతో సమస్య పరిష్కారమైంది. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, సిపిఐ తాలూకా నాయకులు నాగేంద్రప్ప, మండల కార్యదర్శి విరుపాక్షి, ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ అసోసియేషన్ నాయకులు జయలక్ష్మి, ఈరమ్మ, రాధమ్మ, ప్రమీలమ్మ, బేగం, లత, సరోజమ్మ పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని మెడికల్ భవన్‌లో సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జడ్‌పిటిసిలు, మాజీ ఎంపిటిసిలతో సమావేశం నిర్వహించారు. వైసిపి పాలనలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారారని బీవీ తెలిపారు. అనంతరం 23వ వార్డులోని ఎన్‌టి.రామారావు, బాలకృష్ణ ఫ్యాన్ అధ్యక్షులు చంద్ర కాలికి గాయం కావడంతో ఆయనను పరామర్శించారు. అలాగే 23, 24, 25, 26వ వార్డుల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. 23వ వార్డులో ఇన్‌ఛార్జీ సోమల గూడూరు మహబూబ్ బాషా నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా అవకతవకలపై సమీక్ష నిర్వహించారు. అడ్వకేట్ రషీద్, మూర్తి స్వామి, నజీర్ అహ్మద్, తిరుపతయ్య నాయుడు, తెలుగు యువత నాయకులు కృష్ణ తేజ నాయుడు పాల్గొన్నారు.

కార్యకర్తలతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

'కొథారి' కార్మికులకు పరిహారం

ప్రజాశక్తి - ఆదోని

కొథారి మిల్లు కార్మికుల 20 ఏళ్ల నిరీక్షణ నెరవేరిందని, పరిహారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కొడల్‌పేట్, కార్వాన్ పేట్ ప్రాంతాల్లో నివాసముంటున్న కొథారి మిల్లు కార్మికుల ఇళ్లకు వెళ్లి పరిహారం అందజేశారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మిల్లు ఎమ్‌డి గట్టు నాగభూషణం తనయుడు ఫణిధర్‌తోను, మిల్లుకు సంబంధించిన కార్మిక సంఘాల నాయకులతోనూ కలిసి పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. 2003లో కొథారి మిల్లు మూత పడిందని, అప్పట్లో కార్మికులకు రావాల్సిన బకాయిలను కొంతవరకు తాను ఇప్పించామని తెలిపారు. మిగిలిన బకాయిలను ఇప్పించడానికి గత కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చలు సఫలమయ్యాయని చెప్పారు. సుమారు రూ.9 కోట్ల పరిహారాన్ని 772 మంది కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,16,525 చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. గత 20 ఏళ్లుగా కార్మికులు బకాయిల కోసం చేసిన నిరీక్షణ ఫలించడం, తన హయాంలోనే కార్మికులకు పరిహారం ఇచ్చే అవకాశం రావడం తన అదృష్టమని చెప్పారు. మూతపడిన పరిశ్రమ ఎమ్‌డి తనయుడు, ప్రముఖ న్యాయవాది జీవన్ సింగ్, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు సహకరించడంతోనే సమస్య పరిష్కారమైందన్నారు. మిల్లులో పని చేసి చనిపోయిన కార్మికుల కుటుంబాలు వివరాలు, డెత్ సర్టిఫికెట్ తీసుకొస్తే వెంటనే డబ్బులు ఇచ్చే మార్గం చూపుతామన్నారు. కార్మికులకు న్యాయం చేయడానికి అందరితో చర్చించి ఒక ఒప్పందం ప్రకారం వారానికి 50 మంది చొప్పున పరిహారం ఇస్తున్నట్లు తెలిపారు. వైసిపి గౌరవాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, వక్ఫ్ బోర్డ్ మాజీ డైరెక్టర్ ఇస్మాయిల్, కార్మిక సంఘాల నాయకులు అజయ్ బాబు, కల్లుబావి రాజు, నాగరాజు ఉన్నారు.

దస్తావేజు పోయినది

కె.వెంకటేశ్వర్లు తండ్రి లేట్ కొంగతి నరసింహులు ఇంటి నెంబర్ 15/100-1బి, విక్టోరియాపేట, ఆదోని నివాసి అయినా నేను నా పేరిట ఉన్న డాక్యుమెంట్ నంబర్ 1941/ 2016 దస్తావేజు కలదు సదరు దస్తావేజు ఇల్లు మార్పు చేసున్న సమయంలో పై దస్తావేజు 1/12/2023 తేది నాడు మిస్సయింది. దస్తావేజు షెడ్యూలు మండిగిరి గ్రామం సర్వేనెంబర్ 366/బి ప్లాట్ నెంబర్ 5లోను కొంత భాగం, 4లోను కొంత భాగం ప్లాటు ఉన్నది. మొత్తం విస్తీర్ణం 160.70 చదరపు గజాలు పై దస్తావేజులు ఎవరికైనా దొరికినచో కింది నెంబర్ కు తెలియజేయగలరు.

కె.వెంకటేశ్వర్లు
సెల్ నెంబరు 916034251

బీవీ వెంటే ఎమ్మిగనూరు ప్రజలు

- టిడిపి యువ నాయకులు గురురాజ్ దేశాయి

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరు నియోజక వర్గ ప్రజలు మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి వెంటే ఉన్నారని టిడిపి యువ నాయకులు, దేశాయి నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయి తెలిపారు. కొంతమంది నిరాశవాదులు టిడిపిలో ఉంటూ బీవీ.జయనాగేశ్వరరెడ్డి పుణ్యమా అని గతంలో పదవులు అనుభవించి, నేడు తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్నారని విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీవీ.మోహన్ రెడ్డి హయాంలో ఉన్నత పదవులు అనుభవించి, బీవీ కుటుంబం, బీవీ.జయనాగేశ్వరరెడ్డి గురించి తప్పుడు ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మిగనూరు టిడిపి టికెట్ కొత్త వారికి ఇవ్వాలని పత్రికల్లో, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తుండడం హాస్యాస్పదమని తెలిపారు. వార్డు మెంబరుగా కూడా గెలవలేని వారు బీవీపై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఆశీస్సులు బీవీ.జయనాగేశ్వర రెడ్డిపై ఉన్నాయని, ఈసారి ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా, బీవీపై బురద జల్లాలని ప్రయత్నించినా ప్రజల ఆశీస్సులతో బీవీ అసెంబ్లీకి వెళ్లడం ఖాయమని తెలిపారు.

ఎల్ఎల్‌సికి సంక్రాంతి వరకు సాగునీరివ్వాలి

- రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువకు సంక్రాంతి వరకు సాగునీరు అందించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. రైతు బ్యాంకు రుణాలు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలని కోరారు. శుక్రవారం ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా రైతుసంఘం ఆధ్వర్యంలో ఆటో జాతా నిర్వహించారు. కౌతాళంలోని అంబేద్కర్ సర్కిల్‌లో మల్లయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి మేలిగిరి ఈరన్న మాట్లాడారు. ఈనెల 15, 16, 17న జరిగే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. రైతుసంఘం నాయకులు మారయ్య, వీరేష్, వెంకన్న, వలీ, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- టిటిడి పాలకమండలి సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగి ఉల్లాసం వస్తుందని టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి తెలిపారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బొంబాయి శివ నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. సీతారామిరెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు జనార్ధన్ రెడ్డి, పెట్రోలు బంక్ శీను, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారికి శాలువా, పూలమాలలు వేసి డప్పు వాయిద్యాలతో బాణసంచా పేల్చి స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. సీతారామిరెడ్డి బ్యాటింగ్ చేయగా జి.భీమిరెడ్డి బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. విశ్రాంత తహశీల్దార్ వర్మ, సిఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ ఆనంద్ రెడ్డి, నాయకులు కరణం, రవికుమార్, పేగుల రాము, రామకృష్ణ పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న సీతారామిరెడ్డి

బుడగజంగాల సంఘానికి ఆర్థిక చేయూత

స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలోని బుడగ జంగాల సంఘానికి సీతారామిరెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. బుడగ జంగాల కార్యాలయం నిర్మిస్తున్నామని, ఆర్థిక సహాయం చేయాలని పెట్రోలు బంకు శీను, బొంబాయి శివను బుడగ జంగాల కులస్తులు కోరడంతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన రెడ్డి సోదరులు రూ.40 వేలు అందజేశారు. అందరూ కలిసి 2024 ఎన్నికల్లో తమ సోదరుడు వై.బాలనాగిరెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు జి. భీమారెడ్డి, సీఐ శ్రీనివాసులు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచ్ హోటల్ పరమేష్, మాజీ ఉప సర్పంచ్ గోర్కల్ కష్ణస్వామి ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎన్నికల శంఖారావం'ను

విజయవంతం చేయండి : మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 20న నెల్లిమర్ల నియోజకవర్గంలోని పోలెపల్లిలో జరిగే ఎన్నికల శంఖారావం సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు కోరారు. శుక్రవారం ఆదోనిలోని టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని నియోజవర్గంలో 'భవిష్యత్తు గ్యారెంటీ'ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎన్నికలు ఎప్పుడైనా జరగవచ్చని, అందుకు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. పార్టీ ఆదేశాలను పాటిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, కర్నూలు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, నాయకులు అప్సర బాష, బసాపురం రామస్వామి, జెబి.రంగన్న, బసవరాజు, సున్నం బట్టి లక్ష్మన్న, మాజీ ఎంపిటిసి శివప్ప, ముజీబ్ అహ్మద్, వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

జగన్‌తో రాష్ట్రాభివృద్ధి : వైసిపి

ప్రజాశక్తి - హోళగుంద

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైసిపి యువ నాయకులు ఎస్‌కె.గిరి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ సహకారంతో సర్పంచి కురువ చామండేశ్వరి ఆధ్వర్యంలో ఎల్లార్తి గ్రామంలో కన్నడ పాఠశాల నుంచి కోళి రామలింగమ్మ ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగనన్నతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మంత్రి జయరామ్‌ను గెలిపించాలని కోరారు. వర్షం వస్తే చాలు బడి పిల్లలు, ప్రజలు తిరగాలంటే ఇబ్బందిగా ఉండేదని, మంత్రి జయరామ్ దృష్టికి తీసుకెళ్లగా రూ.10 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. రుద్రయ్య స్వామి, శంకరప్ప, ఈరన్న, పంపా శ్రీనివాస్ రెడ్డి, దుర్గప్ప, శేషి, ఈరన్న పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగించారని

వాటర్ మేన్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హాలహర్వి

తనను విధుల నుంచి తొలగించారని వాటర్ మేన్ పరశురామ్ శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మండలంలోని అమృతాపురం గ్రామానికి రుద్రప్ప కుమారుడు పరశురామ్ 10 ఏళ్లుగా ఆర్‌డబ్ల్యుఎస్‌లో వాటర్‌మేన్‌గా పని చేస్తున్నారు. గ్రామానికి చెందిన రాజశేఖర్ ఒత్తిడితో మండలానికి చెందిన కొంతమంది వైసిపి నాయకులు తనను ఉద్యోగం నుంచి తొలిగిస్తారని విషయం తెలుసుకున్న పరశురామ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అతని మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. పరశరామ్ తండ్రి రుద్రప్ప కూడా వాటర్ మేన్ 20 ఏళ్లు పని చేశారు. ఆయనకు వయస్సు మీద పడడంతో కొడుకు పరశురామ్‌ను పనిలో పెట్టారు. పరశురామ్ పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. కొంతమంది వైసిపి నాయకులు హరిజన శేఖర్‌ను వాటర్‌మేన్‌గా ఉంచి పరశురామ్‌ను తొలగించేందుకు అధికారులతో కుట్రలు పన్నారని తెలుసుకొని పురుగు మందు తాగారు. బాధితుని హాలహర్వి ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించారు. పరశరామ్ తండ్రి రుద్రప్ప మాట్లాడారు. తన కుమారుని ఉద్యోగం నుంచి తొలగిస్తామని ఒత్తిడి తేవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఘనంగా వల్లభాయ్ పటేల్ వర్ధంతి

హోళగుంద : హోళగుందలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.అమానుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు హెచ్.పరసప్ప, చాకలి వెంకటేష్, బోయ సుధాకర్, కరిడి వెంకటేష్, రాజు, బోయ మల్లేష్, బోయ సిద్ధమల్ల, ఎరుకుల బసవ, కురువ నాగరాజు, ముస్తఫా, హుస్సేన్, మురళీ, వడ్డే భీమ, బోయ రామదాసు పాల్గొన్నారు.

జై భీమ్ మాలమహానాడు బలోపేతమే లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జైభీమ్ మాలమహానాడును బలోపేతం చేయడమే తమ లక్ష్యమని జైభీమ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రంగయ్య తెలిపారు. శుక్రవారం రంగయ్యకు మద్దతుగా దేవనకొండ మాలలు ఎమ్మిగనూరులోని జైభీమ్ మాల మహానాడు కార్యాలయంలో ఆయనను కలిసి మద్దతు తెలిపారు. జిల్లా మహిళా అధ్యక్షులు మాల సావిత్రి దేవనకొండ మహిళలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. డివిజన్ నాయకులు బన్నూరు నరసింహులు నాయకత్వంలో వివిధ గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చారు. శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. పత్తికొండ నియోజకవర్గంలో మాలల పరిస్థితి దుర్భరంగా ఉందని, తమను పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రంగయ్య మాట్లాడుతూ... జిల్లా నాయకులు చేస్తున్న కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన వారి సమస్యలపై విశ్లేషణ చేసి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. నాయకులు మల్లేష్, జిల్లా యువదళం నాయకులు బలరామ్, రాముడు, బాలాజీ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పరమేష్, డివిజన్ అధ్యక్షులు నరసింహులు, అలారుదిన్నె ఈశ్వరప్ప, మాల నాగరాజు, రంగస్వామి, గిడ్డయ్య, నరసింహులు, దస్తగిరి, దేవనకొండ మహిళలు సుజాతమ్మ, వెంకమ్మ, జయలక్ష్మి, మాల జయలక్ష్మి, మాల లక్ష్మి, ఉరుకుందమ్మ, చంద్రవతి, శ్రీలత పాల్గొన్నారు.

రంగయ్యకు మద్దతు తెలుపుతున్న దేవనకొండ మాలలు

IN THE COURT OF THE HON'BLE
II ADDITIONAL DISTRICT JUDGE:
KURNOOL AT ADONI
I.A.No.74/2023

1. Mir Siraj Ahmed
2. Abdul Khader Tolkar. ...Appellants

Vs

Mir Mohammed Farooq. ...Respondent

Notice to Respondent

To
Mir Mohammed Farooq S/o Mir Mohammed Thair, Muslim, Aged about 52 years, Merchant, D.No.14/4, Khazipura Street, Adoni town, Kurnool district.

Whereas the above named appellants filed the above appeal against you as against the decree and judgment in O.S.No.225/2020 of II Additional Junior civil Judge court, Adoni with dealy petition to condone the delay in filing the appeal. Hence you are hereby required to appear before this court On 10.01.2024 at 10.30 AM and answer the said appeal, otherwise the matter will be decide exparte.

(By court Order)
T.Satyanarayana,
B.Adisheshappa,
Advocates,
Yemmiganur 518 360
Kurnool Dist.
Cell No.9885965252.

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడము ఏమనగా శ్రీ మతి జుకూర్ మల్లమ్మ w/o జుకూర్ చంద్ర శేఖర్, ఇంటి నెంబర్:25/776, బంగారు బజార్, ఆదోని పట్టణం మరియు మండలం, కర్నూల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, వారు షెడ్యూల్ ఆస్తి పై Housing Loan 564 Limited, Adoni వారికి దరఖాస్తు చేసివున్నారు. Cholamandalam Investment & Finance Company సదరు శ్రీ మతి జకూర్ మల్లమ్మ W/o జుకూర్ చంద్ర శేఖర్, ఇంటి నెంబర్: 25/776, బంగారు బజార్, ఆదోని పట్టణం మరియు మండలం, కర్నూల్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్, వారికి షెడ్యూల్ ఆస్తి వారికి రిజిస్టర్ దస్తావేజు నెంబరు: 10193/2023, Dated: 17/08/2023, ద్వారా పొందినారు. సదరు శ్రీమతి జుకూర్ మల్లమ్మ w/o జుకూర్ చంద్ర శేఖర్, ఇంటి నెంబర్:25/776, బంగారు బజార్, ఆదోని పట్టణం మరియు మండలం, కర్నూల్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్, వారు షెడ్యూల్ ఆస్తి కి సంబందించిన లింక్ దస్తావేజు : 3995/2023 Dated: 06/04/2023, de (Rectification deed) & 2. డాక్యుమెంట్స్ కి సంబందించిన సర్వాధికారములు నా క్లయింట్ కు కలవు. ఈ డాక్యుమెంట్స్ దొరికినచో Cholamandalam Investment & Finance Company Limited, Adoni. వారిని సంప్రదించగలరు.

కర్నూలు జిల్లా ఆదోని సబ్ జిల్లా మండగిరి గ్రామ పంచాయతీ పరిది లోని వివరములు
సర్వేనెంబరు: 446/ 8,446/11, 447/A, 454/A2, 455/A, ప్లాట్ నెంబర్ : 26
చెక్కుబంది:
తూర్పు : 33 అడుగులు వెడల్పు గల కాలనీ రోడ్
పడమర: మిగులు ప్లాట్ నందు టి.మని గారు కొన్న ఆస్తి
ఉత్తరం: ప్లాట్ నెంబర్ : 28 మరియు 27
దక్షిణం : నా స్వంత మిగులు ఆస్తి

ఇట్లు
M. Jagadiswara Goud,
Advocate, Yemmiganur
Mobile; 9440346080, 7013547388

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అశోక్ ధావలే, విజ్జు కృష్ణన్ తదితరులు

కర్షకుల నినాదాలతో హోరెత్తిన కర్నూలు

ఎఐకెఎస్ కౌన్సిల్ ప్రారంభం

- కర్నూలు నగరంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ - రెడ్‌షర్టు వాలంటీర్లు, దప్పుకళాకారుల ప్రత్యేక ఆకర్షణ

బహిరంగ సభకు హాజరైన రైతు సంఘాల నేతలు, రైతులు, ప్రజలు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి/కార్పొరేషన్/క్రైమ్

దేశ,రాష్ట్రాల, జిల్లాల రైతుల సమస్యలను చర్చించి పాలకులకు దిశనిర్దేశం చేయడానికి, భవిష్యత్తులో రైతుల పక్షాలన పోరాడటానికి కావల్సిన ప్రాతిపదికను రూపొందించడానికి మూడు రోజులపాటు నిర్వహించే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు కర్నూలు వేదిక అయింది.

తొలిరోజు శుక్రవారం కర్నూలు నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కర్షక లోకం కదం తొక్కింది. కర్నూలు నగరంలో ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సత్య ఇన్ రెసిడెన్సీలో శంకరయ్య నగర్ వేదికగా దేశంలోని ఆయా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే పతాక ఆవిష్కరణ చేశారు. నాయకులు, కౌన్సిల్ కమిటీ సభ్యులు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే అధ్యక్ష ఉపన్యాసం చేశారు. సాయంత్రం భారీ ప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్రీరామ్ థియేటర్, మౌర్య ఇన్, రాజ్ విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ మీదుగా పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ క్రిష్ణన్ ర్యాలీ అగ్ర భాగాన నిలిచి ముందుకు నడిపించారు. ర్యాలీలో రైతులు ఎర్ర కండువాలు, ఏఐకేఎస్ జెండాలతో ర్యాలీ ఆద్యంతం ఎరుపెక్కింది. అత్యంత క్రమశిక్షణతో రైతు సంఘం నినాదాలు చేస్తూ అత్యంత ఉత్సాహంగా ముందుకు కదిలారు. ర్యాలీకి ముందు భాగాన స్వాగతం పలుకుతూ ఎపి డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యలో ప్రదర్శించిన డప్పుల దరువు నృత్యంతో నగరం దద్దరిల్లింది. ర్యాలీలో ముందు భాగాన ఎర్ర దుస్తులు ధరించిన వాలంటీర్లు కవాతుతో ఘన స్వాగతం పలికారు. వెంకటేష్ థియేటర్ సమీపంలో యుటిఎఫ్ నాయకులు సంఘీభావాన్ని తెలియజేస్తూ పూల వర్షంతో ర్యాలీకి స్వాగతం పలికారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా రైతాంగంలో భారీ ఎత్తున చైతన్యాన్ని, స్ఫూర్తిని రగిలించేలా రైతుల ప్రదర్శన కొనసాగింది. ర్యాలీ అనంతరం అంబేద్కర్ కూడలి వద్ద ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు.

కార్యక్రమంలో ఎఐకెఎస్ ఆర్థిక కార్యదర్శి కె.కృష్ణ ప్రసాద్, ఉపాధ్యక్షులు టి.సాగర్, రైతు సంఘం సీనియర్ నాయకులు కేశవ రావు, సూర్యనారాయణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు, రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అధ్యక్షులు కె.వెంకటేశులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిఐటియు సీనియర్ నాయకులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద జోహార్లు అర్పిస్తున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, ఎంఎ.గఫూర్, వి.కృష్ణయ్య తదితరులు

ప్రజల సమస్యలు ప్రభుత్వానికి పట్టవు

- ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా

ప్రజల సమస్యలు కేంద్ర ప్రభుత్వానికి పట్టవని ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా అన్నారు. రైతుల ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. అబద్ధాలు చెప్పడంలో, ప్రజలను మోసం చేయడంలో మోడీ నంబర్ వన్‌గా ఉన్నారన్నారు. నల్ల ధనాన్ని లేకుండా చేస్తామన్న మోడీ ఏం చేశారని ప్రశ్నించారు. ఎపి ప్రజలు కూడా పోరాటాలతో ముందుకెళ్లాలని, మతోన్మాద బిజెపిని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా కర్నూలు అని, పాలకుల నిర్లక్ష్యంతోనే ఆ పరిస్థితి దాపురించిందని అన్నారు. ఏ ప్రభుత్వమూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టలేదన్నారు. ఈ ప్రభుత్వాలకు ప్రజల కష్టాల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. అందుకే కర్నూలు జిల్లా ఆకలి, కరువు, వలసతో అల్లాడి పోతోందన్నారు. కర్నూలు జిల్లా సమగ్రభివృద్ధి సాధించాలంటే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కనీసం 350 మండలాలను కరువు మండలాలుగా, కర్నూలు జిల్లాకు కరువు జిల్లాగా ప్రకటించాలని అన్నారు. కర్నూలును కరువు, వలసల నుండి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ఎఐకెఎస్ అఖిల భారత అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజూ కష్ణన్ ప్రసంగించారు.

మాట్లాడుతున్న ఎఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా

రైతులు, కార్మికులు పోరాటాలకు ముందుకు రావాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్

దేశాన్ని, దేశంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాలని, రైతులు, కార్మికులు పోరాటాలకు ముందుకు రావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గఫూర్ పేర్కొన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మోడీని ఓడించిన చరిత్ర రైతు సంఘాలకు ఉందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని, కార్మికులకు కూడా రైతాంగ పోరాటమే స్ఫూర్తి అని తెలిపారు. ప్రతి పంటకూ గిట్టుబాటు ధర ఇస్తేనే రైతుల జీవితాలు బాగుపడతాయన్నారు. ప్రభుత్వాలు రైతులను, కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. రాబోయే కాలంలో ఉద్యమాలు చేసి హక్కులను కాపాడుకోవాలని, వ్యవస్థను మార్చాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు ఉమ్మడిగా సమరశీల పోరాటాలు సాగించాలన్నారు. రైతాంగంతో పాటు కార్మికులు కూడా కలిసి పోరాడతారన్నారు. లక్షలాది మంది వలస వెళ్తుంటే జగన్‌కు చీమ కుట్టినట్టైనా ఉందా అని ప్రశ్నించారు. ప్రజల కష్టాలు ఎమ్మెల్యేలకు, ఎంపీలకు పట్టడం లేదన్నారు. మూడు నెలల తరువాత జగన్‌కు ప్రజలు రాజకీయంగా సమాధి కడతారన్నారు. విధ్వంసం, మత విద్వేషం, ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే బిజెపి రాజనీతి అన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్

అమరవీరులకు ఎఐకెఎస్ కౌన్సిల్ సంతాపం

అమర వీరులకు ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశం సంతాపం తెలిపింది. సంతాప తీర్మానాన్ని కేరళ కిసాన్ సభ నాయకులు ఎం.విజయ కుమార్ ప్రవేశపెట్టారు. ఎఐకెఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్.శంకరయ్య, ఎఐకెఎస్ మాజీ ఉపాధ్యక్షులు మదన్ ఘోష్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సునీత్ చోప్రా, సిఐటియు మాజీ ఉపాధ్యక్షులు బసుదేవ్ ఆచార్య, అఖిల భారత రైల్వే ఫెడరేషన్ నాయకులు కనై బెనర్జీ, కేరళ మాజీ ఎమ్మెల్యే ఆనందన్, త్రిపుర ఎఐకెఎస్ నాయకులు మణిక్ దాస్ గుప్తా, పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి నారాయణ బిస్వాస్, ఐద్వా మాజీ ఉపాధ్యక్షులు సరోజినీ బాలానందన్, హర్యానా ఎఐకెఎస్ నాయకులు ప్రదీప్ సింగ్, ఎఐకెఎస్ నాయకులు మృదుల్ దే, సౌతాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ నాయకులు క్రిస్ మత్లకో, సహరణ్‌పూర్ రైతు సంఘం నాయకులు గులాబ్ సింగ్‌కు కౌన్సిల్ సమావేశం సంతాపం తెలిపింది. యుపి సిఐటియు నాయకులు కెఎన్.బట్, త్రిపుర ఎఐకెఎస్ నాయకులు శామ్యూల్ హక్, ఎఐకెఎస్ నాయకులు వివన్ సుందరం, పులిన్‌బర్ధన్, యుపి ఎఐకెఎస్ నాయకులు అదిక్ అహ్మద్, కేరళ సిపిఐ కార్యదర్శి ఖానం రాజేంద్రన్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్, జెఎన్‌యు ప్రొఫెసర్ అనిల్‌భట్టి, జనమోర్చ చీఫ్ ఎడిటర్ శీతల్‌సింగ్, పశ్చిమ బెంగాల్ ఎఐకెఎస్ మాజీ ఉపాధ్యక్షులు హరేకృష్ణ సమంద, కేరళ కర్షక సంఘం ఉపాధ్యక్షులు పికె.సుధాకరణ్, మాజీ ఎమ్మెల్యే కె.కుంజరామన్, తమిళనాడు కిసాన్‌సభ నాయకులు శక్తివేల్, శంకర్, జార్ఖండ్ సిపిఎం నాయకులు సుబాష్ ముండా, బీహార్ ఎఐకెఎస్ నాయకులు రాజేష్ హన్సల్‌కు సమావేశం సంతాపం తెలిపింది.ఉక్రెయిన్, పాలస్తీనాలో యుద్ధంలో, మృతి చెందిన వారికి, ప్రకృతి వైపరీత్యాల్లో మరణించిన వారికి, వివిధ ఉద్యమాలు, పోరాటాల్లో అమరులైన వారికి సమావేశం సంతాపం తెలిపింది. సంతాప సూచికంగా కౌన్సిల్ సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది.

సంతాప తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న ఎం.విజయ కుమార్, వేదికపై ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తదితరులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా కర్నూలు పాతబస్తీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించి, ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రాల తల్లి బందీ అయ్యిందో మా పల్లెల్లోనా, రాయలేలిన నాటి రతనాలసీమలో రగులుతున్నది కరువు రా, ఊరు విడవమన్నది కరువు ఉరితాడై ఉన్నది కరువు, నేలమ్మ నేలమ్మ నీకు వేలవేల వందనాలమ్మ, భారతదేశం బాకిన పడ్డది, ఎర్రజెండ ఎర్రజెండ ఎన్నియాలో, అని పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ అలరించారు. చేసింది విన్నది చూసి చప్పట్లు చర్చేల నూతన ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈ.రాజు, ఎంపీ బసవరాజు, లోకేష్, బతుకన్న, లక్ష్మీనారాయణ, నోమేశ్వరి, ఏలియా, బజారి, లక్ష్మన్న, ముని, లక్ష్మి, సరిత, అనిత, కిట్టు, సుబ్బు, నాగ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేదికపై పిఎన్ఎం కళాకారుల నృత్య ప్రదర్శన

సమ్మె ఉధృతం

- నల్ల చీరలతో అంగన్‌వాడీలు నిరసన - మద్దతు తెలిపిన టిడిపి, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు
- కేంద్రాల తాళాలు పగలగొట్టిన సచివాలయ సిబ్బంది - బండి ఆత్మకూరులో అడ్డుకున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని నాలుగో రోజు శుక్రవారం సమ్మెను కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు నల్ల చీరలు ధరించి నిరసన తెలియజేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే అంగన్‌వాడీల పట్ల చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నందికొట్కూరు పట్టణంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఆళ్లగడ్డలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆత్మకూరు, వెలుగోడులో మాజీ మంత్రి ఏరాసు ప్రతాప రెడ్డి, సిపిఎం, యుటిఎఫ్ నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు. నంద్యాల, ఆళ్లగడ్డ, పాములపాడు మండలాల్లో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను సచివాలయ సిబ్బంది పగలగొట్టి తెరిచారు. బండిఆత్మకూరులో అంగన్‌వాడీలు అడ్డుకోవడంతో సచివాలయ సిబ్బంది వెనక్కి వెళ్లిపోయారు.

బేతంచెర్ల : అంగన్వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు రూ. 26 వేలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి షేభారాణి, జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ గుల్జార్‌బీ, నాగలక్ష్మి ఆధ్వర్యంలో నల్ల చీరలు ధరించి సిఐటియు కార్యాలయం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించ కుండా ఆలస్యం చేసి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని దొడ్డిదారిన ప్రయత్నాలు చేస్తే అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ఎన్ని రోజులైనా ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. అనంతరం బేతంచెర్ల మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీదేవికి వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాజబాబు, మధుశేఖర్, **మిగతా 6వ పేజీలో..**

తాళాలు పగలగొట్టిన సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను సచివాలయ సిబ్బంది పగలగొట్టారు. నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలో అంగన్వాడీ సెంటర్-2 తాళాలను ఎపిఎం గుర్రప్ప, సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యాదర్శి-1, 2 గీతావాణి, శ్రీనివాసులు, విఆర్ఒలు వి.సుబ్బారెడ్డి, సల్మాన్ ఖాన్, మహిళా పోలీస్ యశోదమ్మ ఆధ్వర్యంలో తలారి బూరిగేలు, తలారి కుమార్ తాళాలు పగుల గొట్టి అంగన్వాడీ కేంద్రంలోనికి ప్రవేశించారు. అలాగే అయ్యాలూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం తాళాలను పంచాయతీ అధికారులు పగలగొట్టారు. **చాగలమర్రి :** మండలంలోని మద్దూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం తాళాన్ని సచివాలయ అధికారులు పగలగొట్టారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. **పాములపాడు :** పాములపాడు మండలంలో 12 అంగన్వాడీ సెంటర్ల తాళాలను అధికారులు పగలగొట్టారు. అంగన్వాడీ టీచర్లు సమ్మెలో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెంటర్ నిర్వహణ బాధ్యతలు ఇతర శాఖలకు అప్పగించినట్లు ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు.

నంద్యాల తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్ల చీరలు ధరించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బేతంచెర్లలో ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

కొత్తపల్లె అంగన్‌వాడీ తాళాలను పగలగొడుతున్న దృశ్యం

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముగిసిన ఆశాల 36 గంటల నిరసన దీక్ష

- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 36 గంటల ధర్నా, వంటావార్పు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. 36 గంటల ధర్నా ముగింపు సందర్భంగా డిఆర్ఓ పుల్లయ్యకి, డిఎంహెచ్ఒ వెంకట రమణకి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.ఏసురత్నం, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.లక్ష్మణ్‌లు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలని, పనిభారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, రిటైర్మెంట్, గ్రూప్ న్సూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఆశా నియామకాల్లో రాజకీయ జోక్యం తొలగించాలన్నారు. ప్రభుత్వమే నియామకాలు జరపాలని, రిటైర్మెంట్ కాలాన్ని 62 ఏళ్ళకు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించిన తరువాతే రిటైర్మెంట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినా నేటి వరకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయలేదన్నారు. ఇప్పటికీ స్పందించకుంటే చలో విజయవాడకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారి, అధ్యక్షురాలు నాగమణి, జిల్లా నాయకురాలు వెంకట లక్ష్మమ్మ, షమీమ్, శివమ్మ, లలితమ్మ, శివలక్ష్మి, సుమలత, శివలక్ష్మి, కృపావతి, సరస్వతి, లింగమ్మ, చిన్నమ్మ, నాగేంద్రమ్మ, భారతి, సుబ్బలక్ష్మి, లక్ష్మీదేవి, మంజుల, మోబిన, సుభద్ర, సువర్ణ, శిరోమణి, మద్దమ్మ, భాగ్యమ్మ, నాగలక్ష్మి, చిన్నమ్మ, పిహెచ్‌సి సెంటర్‌ల నాయకురాళ్లు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో నేడు శనివారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపడుతున్నట్లు మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షులు మేకల లింగస్వామి తెలిపారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య హాజరవుతున్నట్లు తెలిపారు.

పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేట్ కూడలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, డిఆర్ఒ బి.పుల్లయ్య, ఇతర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడారు. ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములు గారిదేనని కొనియాడారు. డిఆర్ఒ మాట్లాడుతూ దేశభాషల సమున్నతికి బలిదానం చేసిన త్యాగమూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణకు మూలపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. **అవుకు :** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం కారణంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని అవుకు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు అన్నారు. ఆవుకు పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య పెద్దలు బొగ్గరపు రామాంజనేయులు, బూరుగుల వెంకట సుబ్రహ్మణ్యం, తల్లం సుబ్రహ్మణ్యం, సన్నిధి శ్రీనివాసులు, సన్నితి శివ, మేడం శ్రీధర్, మిరియాల లోకేష్, తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి, టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యలు పేర్కొన్నారు. పట్టణంలోని మాజీ సర్పంచి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిసి రాజా రెడ్డి, టంగుటూరి శీనయ్యల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పేరుమీద రెండు తెలుగు రాష్ట్రాల కేంద్రాలల్లో ప్రభుత్వాలు స్మృతి వనాలు ఏర్పాటు చేయాలని, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో లాయర్ నాగేంద్ర రెడ్డి, టిడిపి కోశాధికారి ఖాదర్, నాయకులు బత్తుల భాస్కర్ రెడ్డి, డేగల వీరన్న, ఆర్యవైశ్య సంఘం నాయకులు కాసుల జంగం శెట్టి, బచ్చు భాస్కర్ రామ్ గోపాల్, రిటైర్డ్ ఉపాధ్యాయులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళు లర్పిస్తున్న ఎమ్మెల్సీ, డిఆర్ఒ

బనగానపల్లె : నివాళ్లులర్పిస్తున్న బిసి రాజారెడ్డి తదితరులు

మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : చైర్మన్

ప్రజాశక్తి-డోన్

అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందిం చడం జరిగిందని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం డోన్ పట్టణంలోని తారక రామానగర్‌లోని 15వ సచివాలయంకు సంబంధించిన 27, 28వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరై మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేశారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులై ఉంటే చాలు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారునికి అందించడం జరిగిందన్నారు. ప్రజలు వచ్చే ఎన్నికలలో అభివద్ధి చేసిన వారికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,పట్టణ జేసీఎస్ కన్వీనర్ కురుకుంద హరి,కౌన్సిలర్లు వెంకటరాముడు, సుంకన్న,కో ఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు,సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, గోపాల్, గృహసారథులు, నాయకులు ఎద్దుపెంట వెంకటేష్,సుంకన్న, సుధాకర్,మెప్మా సిబ్బంది,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో

బాల అకాడమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్రస్థాయి 67వ స్కూల్ గేమ్స్ అధ్వర్యంలో విజయనగరం జిల్లా రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 11, 12, 13వ తేదీలలో జరిగిన బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో జరిగిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ బాలికల విభాగంలో అండర్-17లో యస్.ఆఫియ, వికె.దీపిక (బ్రాంజ్), యస్.శరణ్య (సిల్వర్), బాలుర విభాగంలో అండర్-14లో యస్.రంజాన్ షరీఫ్, యస్.లిఖిత్ అశ్విన్ (బ్రాంజ్), అండర్-17లో యస్.తౌసిఫ్ (బ్రాంజ్), యస్.మహమ్మద్ జోహెబ్ (సిల్వర్) పతకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎమ్‌జివి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఇంకా మంచి పతకాలు సాధించి జిల్లాకు పేరును తీసుకురావాలని కోరుకుంటూ కోచ్ మహేష్ యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీడీవో, ఏరియా కోఆర్డినేటర్

ఆడపిల్లల చదువు అందరికీ వెలుగు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆడపిల్లల చదువు అందరికీ వెలుగు అని ఎంపీడీవో మేరీ, ఏరియా కోఆర్డినేటర్ పుల్లయ్యలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో మండల మహిళా సమైక్య కార్యాలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి లింగ వివక్షతపై ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఉన్న ఆడపిల్లలందరినీ చదువుకు దూరం చేయడం వల్ల సమాజానికి ఆడపిల్లల జీవితాలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఆడపిల్లల్ని కచ్చితంగా చదివిం చాలన్నారు. మండల సమైక్య కార్యాలయంలో జెండర్ రిసోర్స్ సెంటర్‌ని ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా వివక్షతకు గురైన మహిళలకు కౌన్సిలింగ్, న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు రత్నకుమారి, శివుడు, గోపాల్, చిన్న ముర్తుజా, రామకృష్ణుడు, బాలరాజు, అకౌంటెంట్, వివోఏలు ప్రసన్న, మౌలాబి ఓబి, కృష్ణ గౌడ్, రవి మాధవి, సాంబశివుడు మహిళలు పాల్గొన్నారు.


గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ బండి వరలక్ష్మి, వైసీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి

'ఉజ్వల' గ్యాస్ సిలీండర్లు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యాగంటి పల్లె గ్రామంలో 37 మందికి ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల కింద మంజూరయిన సిలీండర్లను సర్పంచి బండి వరలక్ష్మి, వైసిపి నాయకులు బండి బ్రహ్మానందరెడ్డిలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను ఇస్తున్నట్లు తెలిపారు. సంవత్సరానికి 12 సిలిండర్లు వాడుకోవచ్చని, సిలిండర్‌కు 350 రూపాయల సబ్సిడీ వర్తిస్తుందన్నారు. రూ. 2 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' వాయిదా : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎంపీడీవో వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఈనెల 15వ తేదీన జరగాల్సిన ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలు రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. రాష్ట్రంలోని కోనసీమ జిల్లాలో తుఫా ను కారణంగా భారీ వర్షాలు పడి వరదలు సంభవించడంతో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 26వ తేదీన ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతి తీరనిలోటు

- ఎస్‌టియు, యుటిఎఫ్

ప్రజాశక్తి -ప్యాపిలి

ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఎస్టియు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, ఎస్‌టియు ప్యాపిలి మండల నాయకులు చంద్రమౌళి,చిన్నపరెడ్డి, హాజీ మస్తాన్ వలి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎస్టియు ప్యాపి లి మండల ప్రాంతీయ కార్యాలయంలో ఎస్‌టియు నాయకులు సమావేశమై సేక్ సాబ్జి మృతి పట్ల సంతాపం ప్రకటించారు. అంగన్వాడీ కార్యకర్తల ఆందోళనలో పాల్గొని తిరిగి వెళుతుండగా ప్రమాదంలో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు సమీపంలో రోడ్డు ప్రమాదంలో షేక్ సాబ్జి మృతి చెందడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు వెంకట్ నాయక్, చిన్నపరెడ్డి, మనోహర్, శేష నాయక్, చంద్రబాబు, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

సాబ్జీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

డోన్ : డోన్ పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో డోన్ మండల అధ్యక్షుడు బివై సుబ్బారాయుడు అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమంలో అకాల మరణం చెందిన ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ షేక్ షాబ్జీకి డోన్ డివిజన్ యుటిఎఫ్ నాయకులు షేక్ షాబ్జీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ గౌరవా ధ్యక్షులు నరసింహుడు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా పూర్వ గౌరవాధ్యక్షులు బాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, జిల్లా కార్యదర్శి నరసింహా రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో యుటిఎఫ్ కార్యకర్తలను, నాయకులను ఉత్తేజపరిచి, ఉద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో తన వంతుగా కృషి చేసిన మహనీయుడు షేక్ షాబ్జీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డోన్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, ప్యాపిలి మండల అధ్యక్షులు క్రిష్ణా నాయక్, క్రిష్ణగిరి మండల అధ్యక్షుడు రామమూర్తి, కేశవరెడ్డి, బాలరంగారెడ్డి,లతీఫ్,లక్ష్మి నాయక్, సంజీవ రాయుడు, సర్వప్ప మూర్తి, చంద్రమోహన్,అంజనప్ప, సుమన్, కంబగిరి, సాలయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై విచారిస్తున్న పిడి

సాదాసీదాగా సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - గడివేముల

మండలంలో 2022-23గానూ 16వ విడత ఉపాధి హామీ చట్టంతో పాటు పలు సంక్షేమ పథకాల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో డ్వామా పిడి రామచంద్ర రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు నిర్వహించిన పనులపై జిల్లా రిసోర్స్ పర్సన్ జరిపిన ఆడిట్ పంచాయతీల వారీగా చదివి వినిపించారు. సాంకేతిక తప్పిదాలపై ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లను నిలదీశారు. బుజునూరు, కరీమద్దెల, చిందుకూరు గ్రామాల తో పాటు పలు గ్రామాలకు చెందిన క్షేత్రసహాయకులకు రికవరీలను విధిస్తూ సదరు రికవరీ చేయించాలని డ్వామా పీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి బాలాజీ నాయక్, ఎస్ఆర్పి నీలకంఠం ,పెన్షన్ ఇంచార్జ్ సరస్వతి పి ఆర్ ఏ ఈ భాస్కర్, క్వాలిటీ కంట్రోల్ గంగాద్రి, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, ఏపీఓ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నప్పుడే రోగాలు రాకుండా ఉంటాయని టీబీ సూపర్వైజర్ చెరుకు రవికుమార్ తెలిపారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని శివపురం గూడెం లోని ప్రభుత్వ గిరిజన పాఠశాల యందు విద్యార్థులకు ఆత్మకూర్ టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల ప్రత్యేకత తీసుకోవాలి అన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు వివరించారు. ప్రధానోపాధ్యాయులు వీరన్న వైద్యసిబ్బంది ఎమ్ఎల్‌హెచ్‌పి తిరుమల, హెల్త్ అసిస్టెంట్ సుదర్శనమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆత్మకూర్

జాతీయ స్థాయి ఖోఖో క్రీడాకారుడికి ఆత్మకూర్ వైసిపి నాయకులు పువ్వాడి భాస్కర్ ఆర్థిక సాయం అందజేశారు. ఆత్మకూరుకు చెందిన ఖోఖో క్రీడాకారుడు జగదీష్ ఈనెల 26వ తేదీ నుంచి 30 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు ఎంపిక అయిన క్రీడాకారునికి ప్రకాశం జిల్లా జె. పంగులూరు నందు శిక్షణలో పాల్గొనడానికి వెళుతున్న క్రీడాకారునికి ఆత్మకూర్ వైసిపి నాయకులు, క్రీడా అభిమాని ఆత్మకూర్ ఆర్యవైశ్య నాయకులు పువ్వాడి భాస్కర్ శుక్రవారం నాడు జగదీష్‌కు ఆర్థిక సహాయము చేశారు. ఈ కార్యక్రమంలో పువ్వాడి భాస్కర్, సుబ్బారెడ్డి సీనియర్ ఖోఖో క్రీడాకారుడు మహబూబ్, జగదీష్ పాల్గొన్నారు. కర్నూలు జిల్లాఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి ప్రభాకర్ అభినందనలు తెలియజేశారు.

ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న పువ్వాడ భాస్కర్

నన్నారి సాగుపై చెంచులకు అవగాహన

- ఐటిడిఎ స్పెషల్ ఆఫీసర్ కేజీ నాయక్

ప్రజాశక్తి - రుద్రవరం

మాట్లాడుతున్న ఐటిడి ఏ అధికారి కేజీ నాయక్ తదితరులు

రుద్రవరం మండలం హరినగరం చెంచు కాలనీలలో నన్నారి పంట సాగుపై చెంచులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఐటిడిఏ స్పెషల్ ఆఫీసర్ కేజీ నాయక్ మాట్లాడుతూ చెంచులకు 100 శాతం సబ్సిడీతో నన్నారి పంట సాగు చేసుకోవడానికి డ్రిప్ ఇరిగేషన్, ఆయిల్ ఇంజన్, పవర్ స్ప్రేయర్ తదితర వాటిని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఢి.వనిపెంట, హరినగరం గ్రామాలలో 100 ఎకరాలలో నన్నారి పంట సాగు చేసుకోవడానికి చెంచులకు ఐటిడిఏ తరపున ఉపాధి హామీ పథకం కింద నిధులు కేటాయించినట్లు తెలిపారు. కావున చెంచులు నన్నారి పంట సాగుపై ఆసక్తి చూపాలన్నారు. సాగు చేసే వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి ధనుంజయ్, వెలుగు ఏపిఎం జోహార్ భాష, సత్యనారాయణ, సీసీ వీరన్న, ఉపాధి టిప రవీంద్ర నాయక్, సర్పంచ్ సవరం కమల, వైసీపీ నాయకుడు సవరం నాగముని, చెంచులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో కెవి సుబ్బారెడ్డి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈనెల 14వ తేదీ కర్నూల్లోని ఆర్‌యు క్యాంపస్ లో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్లు భూమా శ్రీనివాసరెడ్డి, ఓబన్నలు మాట్లాడుతూ పురుషుల అథ్లెటిక్స్ త్రో విభాగంలో మూడో సంవత్సరం డిగ్రీ విద్యార్థి హరీష్ మూడోస్థానం, షాట్ పుట్‌లో మొదటి స్థానం, జావెలిన్ త్రోలో కిరణ్ కుమార్ రెండవ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ మహబూబ్ భాషను అభినందించారు. ప్రతి విద్యార్థి తనలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి ఆళ్లగడ్డకు, కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు.

టిడిపి గెలుపునకు కృషి చేయండి

ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం బేతంచెర్ల స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన టిడిపి నాయకులు, కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న డోన్ నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలని నాయకులకు కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. సైకో జగన్ పాలనలో అన్ని రంగాలలో అభివృద్ధి వెనుకబడిందని ప్రజలు విసుగెత్తిపోయారని ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్మోహన్ రెడ్డిని ఓడించాలని అన్నారు. నిత్యం పిట్టకథలు చెప్పే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఇంటికి పంపి ంచడం ఖాయమని వారు అన్నారు. కనుక పాలక ప్రభుత్వాలు బెదిరింపులకు పాల్పడిన అధైర్య పడకుండా ప్రజలతో మమేకమై పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పోలూరు రాఘవరెడ్డి, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, పట్టణ సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం సుధాకర్, గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేశ్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జ్ రమేష్, జాకీర్ మాజీ ఎంపీటీసీ, డోన్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రమల నాయుడు, టిడిపి యువ నాయకులు మన్నె గౌతమ్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, జావాజీ వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ రెడ్డి, శశి కుమార్ అప్ప, వెంకట రాముడు, రాధాకృష్ణ, తిరుమలేష్ రెడ్డి, ధోని రామాంజనేయులు, ఎల్ల స్వామి, గోరుమానుకొండ జంగమయ్య, అంజి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమెంట్ నగర్ రాముడు, ఉరుకుందు, వాసు, సురేష్, చంద్ర, ఆంజనేయులు, జగదీష్, జనార్ధన్, అత్తి నాయక్, పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీధర్, సతీష్ కుమార్, బాలరాజు, సత్యం, వలి, మద్దయ్య, మోహన్ రెడ్డి, మహేష్ యాదవ్, మౌలాలి, రవి, ముసలాయి చెరువు పుల్లయ్య, నారాయణరెడ్డి, ఈరన్న, తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ గెలుపు కోసం కషి చేయాలని కార్యకర్తలతో మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

సమ్మె ఉధృతం

(5వ పేజీ తరువాయి..) అంగన్వాడీలు రాజేశ్వరి, లక్ష్మీదేవి, రాధాదేవి, సుబ్బలక్ష్మి, విజయలక్ష్మి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం డిప్యూటీ తాసిల్దార్ రమాదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మలమ్మ, ప్రాజెక్టు కార్యదర్శి సునీత, జిల్లా నాయకురాలు నాగరాణి, ప్రసన్న, అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన నిరసనకు సిపిఐ (యంయల్) ఆర్ఐ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ మద్దతు తెలియజేసి మాట్లాడారు. **బనగానపల్లె :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నల్ల చీరలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసిల్దార్ కిషోర్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ రోజా రమణి, వర్కర్లు మల్లేశ్వరి, శశికళ, తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ నల్ల చీరలతో ధరించి సమ్మె నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం ఎంపీడీవో సాయి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. వ్యకాసం జిల్లా నాయకుడు ఈ దావీదు, అంగన్వాడీలు పద్మావతి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యం మార్కెట్ యార్డు నుంచి అంగన్‌వాడీలు ర్యాలీగా ఎంపీడీవో ఆఫీస్ వరకు నిర్వహించారు. ఎంపీడీవోకు వినతి అందజేశారు. అంగన్వాడి యూనియన్ నాయకులు వెంకటమ్మ, నంది విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ రామరాజు, సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్, విద్యార్థి సంఘం నాయకులు ప్రతాప్, వెంకటమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** తాసిల్దార్ కార్యాలయం దగ్గర అంగన్వాడి టీచర్లు నల్ల చీరలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఐజయ్య మద్దతును ప్రకటించారు. అంగన్వాడి టీచర్లు మనోజ, తిరుపాలమ్మ, బిబి, తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** అంగన్వాడీ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారని టిడిపి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ తాసిల్దార్ కార్యాలయ ఆవరణంలో అంగన్వాడీల సమస్యలపై నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి , భార్గవ్ రామ్‌లు పాల్గొని సంఘీభావం తెలిపారు. **ఆత్మకూరు :** పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి 4వ రోజు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. **మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి మద్దతు:** అంగన్వాడీల దీక్షలకు మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి మద్దతు ప్రకటించారు. అంగన్వాడీలు గర్భవతులకు పౌష్టికాహారం అందజేస్తూ, చిన్నారులకు విద్యాభ్యాసం చేస్తూ సేవలు అందిస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. **సిపిఎం మద్దతు :** అంగన్వాడీలకు రోజు ఒక కొత్త యాప్‌ను తీసుకొని వచ్చి పని భారం పెంచుతున్నారని, వారు చేస్తున్న పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని, వారి డిమాండ్లను పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, నాయకులు సురేంద్ర, మా భాష, వీరన్న తదితరులు మద్దతు తెలిపారు. **యుటిఎఫ్ మద్దతు:** అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాలు లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు రజాక్, కార్యదర్శి రామ్ నాయక్, నాయకురాలు సుధారాణి, వెంకటలక్ష్మి, లక్ష్మి, ప్రియాంక, ప్రమీల, రవణమ్మ, అరుణ, విజయలక్ష్మి, లక్ష్మీదేవి, చెన్నమ్మ, సుజాత, నాయకులు గణపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు బటన్ తప్ప.. ఏమి తెలుసు: మాజీ మంత్రి ఏరాసు

వెలుగోడు : బటన్ నొక్కడం తప్ప సిఎం జగన్మోహన్ రెడ్డికి కార్మికుల బతుకుల గురించి ఏమి తెలుసునని మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి అన్నారు. అంగన్వాడీల దీక్షలకు మద్దతు తెలిపిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్వాడీల సేవలకు వెలకట్టలేమని కొనియాడారు. వెలుగోడు అంగన్వాడిలకు టిడిపి తరపు నుండి సంఘీభావం తెలిపారు. ఈయన వెంట రాఘవరెడ్డి, బోయ రేవుల సర్పంచ్ సామన్న, రామదాసు ఉన్నారు. అదేవిధంగా మూడో రోజు సమ్మెలో సంఘీభావంగా అవాజ్ కమిటీ మహమ్మద్ రఫీ, యాదాటి నాగేంద్రుడు, సిఐటియు మండల అధ్యక్షులు నాగమోహన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘు రాముడు, ఎమ్ ఆర్ పి ఎస్ నాగశేషులు సంఘీభావన్ని తెలియజేశారు. **నందికొట్కూరు టౌన్ :** అంగన్వాడీ మహిళల పట్ల దురుసుగా మాట్లాడిన బొబ్బిలి ఎమ్మెల్యే దిష్టిబొమ్మను పి మదర్ బి అధ్యక్షతన నందికొట్కూరు పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర దహనం చేశారు. అనంతరం అక్కడి నుండి పటేల్ సెంటర్ మీదుగా ర్యాలీగా వెళ్లి ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఏసిడిపిఒ అధికారి మంగవల్లికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరావు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, ఆంజనేయులు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **జూపాడుబంగ్లా మండలంలో** 4వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక బంగ్లా సంత గేటు నుంచి అంగన్వాడీలు నల్ల దుస్తులు ధరించి భారీ ప్రదర్శన నిర్వహిస్తూ కోటర్స్ లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తాసిల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు గిరీష్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు కార్యకర్తలతో కలిసి అంగన్‌వాడీ వర్కర్స్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యకాసం నేతలు ఎం కర్ణ, వెంకట రమణమ్మ, పద్మావతి , ప్రసన్న, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి:** స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో అంగన్వాడీలు నాలుగవ రోజూ నిరసన దీక్షలు చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు భారీ ర్యాలీగా తరలివెళ్లి మెయిన్ బజార్‌లోని తాసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తాసిల్దారుకు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మృతికి సంతాపం తెలిపారు. సిఐటియు నాయకులు గుత్తి నర్సింహులు , ఈ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** కళ్లకు గంతలు కట్టుకొని అంగన్వాడీలు పగిడ్యాల బస్టాండులో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె విరమించేది లేదని తెలిపారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో వెంకటరమణకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా మహిళా నాయకురాలు గంధం ఉశేనామ్మ , అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **మిడ్తూరు:** సమ్మె చేస్తున్న ప్రభుత్వ స్పందించకుండా సమ్మెను అణచివేసేందుకు సచివాలయ సిబ్బందితో అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వ్యకాస జిల్లా నాయకులు పీపక్కిరి సాహెబ్, టి ఓబులేష్, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, జి లింగస్వామి డిమాండ్ చేశారు. నాలుగో రోజు సమ్మె సందర్భంగా అంగన్వాడీలు స్థానిక శిబిరం నుండి నల్ల చీరలతో ర్యాలీగా బస్టాండ్ మీదుగా ఎంపీడీవో కార్యాల యానికి చేరుకొని ఎంపీడీవో జి నాగ శేషాచలం రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి డి, సుబ్బమ్మ జి, లక్ష్మి కుమారి, వ్యకాస జిల్లా నాయకులు పీ, పకీరు సాహెబ్, టి ఓబులేసు, సిఐటియు మండల నాయకులు వెంకటశివుడు, జి లింగస్వామి మాట్లాడారు. **కొత్తపల్లి :** క్యాబినెట్ సమావేశాల్లో అంగన్వాడీ సమస్యలపై చర్చించి పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు జిల్లా నాయకురాలు ఈ హరిత, కొత్తపల్లి, దుద్యాల సెక్టర్ల నాయకురాలు నాగమణి, రమణమ్మ, శ్రీదేవి, వసంత డిమాండ్ చేశారు. నాలుగో రోజు సమ్మెలో భాగంగా కొత్తపల్లి తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

పాములపాడు : నాలుగవ రోజు అంగన్వాడీలు నల్ల చీరలతో నిరసన తెలిసి అంగన్వాడీ సెంటర్లు నడిపేందుకు సచివాలయ ఉద్యోగస్తులకు బాధ్యతలు అప్పజెప్పరాదని ఎంపీడీవో గోపికృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, రమణ బాయ్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు. **గడివేముల:** అంగన్వాడీలు తాసిల్దార్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. అంగన్వాడి యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వసంతమ్మ, రామ్ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాళాలు పగలకొట్టకుండా అంగన్వాడీల ప్రతిఘటన

బండి ఆత్మకూర్ : ప్రభుత్వ అధికారులు అంగన్వాడీ కేంద్రాలను తాళాలు పగలగొట్టి తెరిస్తే ప్రతిఘటిస్తామని అంగన్వాడీ వర్కర్స్ హెచ్చరించారు. నాలుగోరోజు నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు అంగన్వాడీ కేంద్రాలను తాళాలు పగలగొట్టి తెరుస్తున్నారని సమాచారం తెలుసుకుని అందరూ వెళ్లి అక్కడికి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చిన్న ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అంగన్వాడీ సెంటర్ -1, అంగన్వాడీ సెంటర్ -2 కేంద్రాలను తెలిసేందుకు ప్రయత్నించిన అధికారులు చేసేది లేక వెనుతిరిగి వెళ్లారు. మండలంలోని అన్ని కేంద్రాలను తెరిచేందుకు ప్రభుత్వ అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించుకుని గ్రామపంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది కలిసి అంగన్వాడీ కేంద్రాలను పంచనామా నిర్వహించి అందులో ఉన్న రిజిస్టర్లు సరుకులు స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించడం జరిగింది. అయితే అంగన్వాడీ కార్యకర్తల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ నాయకులు ఆనందమ్మ, వెంకటరమణమ్మ, శ్యామల, వసంత మాట్లాడుతూ తాము చేస్తున్న నిరవధిక సమ్మెను భగ్నం చేసేందుకు తమ హక్కులను కాలరాసేందుకు ప్రభుత్వం తప్పుడుదారుల్లో ప్రయాణిస్తోందని, తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇతరులతో పని చేయించాలని చూస్తే తమ ప్రాణాలైనా తెగిస్తాం కానీ తమ హక్కులను వదులుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రత్నమయ్య, సిఐటియు నాయకులు రాజు, అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్ తాళాలు పగులగొడుతున్న అధికారులను అడ్డుకుంటున్న అంగన్వాడీలు

వెలుగోడు : మాట్లాడుతున్న మాజీ మంత్రి ఏరాసు ప్రతాప రెడ్డి

నందికొట్కూరులో బొబ్బిలి ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి : తహసిల్దార్ కు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు